# పార్వతీ-మామయ్యా!

"అమ్మా! ఏమే? పండుక్కి కొత్త పరికిణీ కుట్టిస్తావా లేదా?" రాగాలు తీస్తూ తల్లిని అడిగింది పార్వతి.

కొయ్యపెట్టెలో దాచిన ముంతను బయటకుతీసి, అందులోని చిల్లర డబ్బులు చేతిలో పోసుకొని లెక్క చూసుకుంటున్న చుక్కమ్మ కూతురువంక తిరిగి అన్నది-

"అప్పుడే ఏం తొందరొచ్చిందే! పండగ ఇంకా చాలారోజులుందిగా?"

"ఊఁ- ఇంకా ఎప్పుడేం? పండగ దగ్గిరకొస్తుంటేను? బోడికి వాళ్ళమ్మ అప్పుడే కుట్టిస్తుంటేను?" గుణిసింది పార్వతి.

"నీకూ కుట్టిస్తాలేవే? పిచ్చిపిల్లా! ఏడవమాక! పండుగనాటికి మీ కోటయ్య మామకూడా వస్తాడుగా! వస్తూ నీకు బోలెడన్ని పరికిణీ గుడ్డలూ, రవిక గుడ్డలూ తెస్తాడే!" అన్నది చుక్కమ్మ కూతురితో.

"ఊఁ- పోవే! నువెప్పుడూ అట్లాగే చెప్తావు? కోటయ్య మావయ్యవన్నీ అబద్ధాలే. మొన్న పండక్కు పోగులు కొనిపెడ్తానని కొనిపెట్టాడూ? అసలు మావయ్యకు నేనంటే ఇష్టమేలేదు. పరికిణీ బట్టలు తేడు-ఏమీ తేడు. కావాలంటే నువ్వే చూడు"- బుంగమూతి పెట్టి అన్నది పార్వతి.

"ఓసి పిచ్చికట్టే, ఊరుకోవే! మామయ్యకు నువ్వంటే పంచప్రాణాలే. కోరిన బట్టలు తెస్తాడు. పండగనాడు ఆదెమ్మ కూతురు తలమీద కొట్టినట్టు, దానికంటే మంచి పరికిణీ, రవికా తొడుక్కొని తిరుగుదువుగాని," అంటూ చుక్కమ్మ చిల్లరడబ్బులు ముంతలో పోసి, ముంత కొయ్యపెట్టెలో అడుగున పాతగుడ్డల చాటున దాచింది.

"ఊఁ- చెప్పావ్‌లే, బోడితో వంతుపెడుతూ. దానికి వాళ్ళమ్మ పరికిణీ కొని మిసినీ సాయిబుకు కుట్టడానికిక్కూడా ఇస్తేను! బోడి నన్ను మిసినీ సాయిబు దగ్గిరకు తీసుకు పోయి చూపిస్తేను! అమ్మోయ్! ఎంత బాగుందనుకున్నావ్? ఎర్రపూలూ, మరేమో- ఇంత పెద్ద నల్లంచూను-" కళ్ళు మెరిపిస్తో అన్నది పార్వతి.

"సరే, నీకూ అట్లాంటిదే కుట్టిస్తాలే! ముందు కరెంటు ఫ్యాక్టరీకిపోయి ఒక బుట్టెడు పొట్టు తీసికొచ్చి ఆ పిడకలు నాలుగు చెయ్యి! నిన్నటినుంచి ఆ కుప్పంతా ఎండిపోతోంది-" అని కూతురుకి పని పురమాయించింది చుక్కమ్మ.

కూతురు వాలకం చుక్కమ్మకు బాగా తెలుసు. దానికి ఏదో పని చెప్పకుండా వదిలేస్తే పొద్దస్తమానమూ, ఆ ఎర్రపూల పరికిణీకోసం మారాం చేస్తూ తన చుట్టూ

తిరుగుతుందని. పార్వతి ఏ గొడవలో పడ్తే ఇక అదే గొడవ. ఆటల్లో పడితే ఇక పనే మర్చిపోతుంది. చీటికి మాటికి 'ఇవి కావాలి' అంటూ తల్లిని వేధించదు. కాని ఒక్కసారి దానికి దేనిమీదనైనా మనసుపడితే దాన్ని సాధించుకొనేదాకా మంకుపట్టు పడుతుంది.

చుక్కమ్మది బతికి చెడ్డ కుటుంబం. చుక్కమ్మ కాపరానికొచ్చిన రోజుల్లో, అత్త గారింట్లో అష్టయిశ్వర్యాలు అనుభవించిందని చెప్పడానికి వీల్లేకపోయినా, కూటికీ గుడ్డకూ లోటు లేకుండానే గడిచిపోయింది.

రాను రాను చుక్కమ్మ సంసారం చితికిపోయింది. పిత్రార్జితమంతా కర్పూరంలా హరించుకుపోవడమూ, చుక్కమ్మ భర్త రామయ్య మంచాన బడటమూ-రెండూ ఒక్కసారే జరిగాయి. తమ ఆ స్థితికి కారణం రామయ్యేనని చుక్కమ్మ అంటే "కాలం కలిసిరాలేదు," అని రామయ్య అనేవాడు. ఏమైతేనేం రామయ్య చనిపోయిన రోజు చుక్కమ్మ చేతిలో నయాపైసా లేకుండా పోయింది.

అప్పటికి పార్వతికి ఏడేళ్లు. రామయ్య పోతూ వదిలిపెట్టిపోయింది ఇప్పుడు చుక్కమ్మ వుంటున్న ఆ నిట్టాడి ఇల్లు మాత్రమే.

మొగుడు చనిపోయాక, ఈ ఆరు సంవత్సరాలనుంచీ చుక్కమ్మ రెక్కల కష్టం మీదే కూతుర్ని పెట్టుకొని బ్రతుకుతూ వుంది.

పిడకలుచేసి అమ్ముకోవడం, వడ్ల దంపూ, మధ్యాహ్నం తీరిక సమయాల్లో రాట్నం తిప్పి సూలు అమ్ముకోవడంలాంటి పనుల్లో చుక్కమ్మ అహర్నిశలూ నిమగ్నమయి వుండేది. వాటిమీద వచ్చే ఆదాయంతో పొట్టనింపుకుంటూ అణా, బేడా వెనకేస్తూ వుండేది.

పార్వతి కాస్త చేతికి వచ్చాక చుక్కమ్మకు కొంచెం వెసులుబాటుగా వుంది. తల్లి వడ్ల దంపుళ్ళకుపోయి సాయంకాలానికి తిరిగొచ్చేసరికి పార్వతి ఓ సోలెడు గింజలు వుడకేసి వుంచేది. పొద్దుటపూట పార్వతి అలా బీట్లోకి పోయి పుల్లా- పోలుసూ ఏరుకొస్తుంటే, పొయ్యిలోకి కొనకుండా కాలం జరిగిపోతూంది.

చుక్కమ్మ కూతురుమీద కొండంత ఆశ పెట్టుకొని కాలం దొర్లిస్తుంది.

ఇప్పుడో రేపో అన్నట్టుగా పార్వతి ఎదిగొస్తూంది.

పిల్ల పెద్దదయాక కోటాయికిచ్చి ఆ మూడు ముళ్ళూ వేస్తే వాళ్ళ బతుకులు వాళ్ళు బతుకుతారు. కోటాయ్‌కూడా బుద్ధికుదిరి ఇంటిపట్టున వుండి, కూలీనాలీ చేసుకొని పెళ్ళాన్ని పోషించుకుంటాడు. తల్లినీ, తండ్రినీ చిన్నప్పుడే పోగొట్టుకొన్న పసివాణ్ణి దగ్గరకు తీసి సాకినందుకు, వాణ్ణి ఒక ఇంటివాడ్ని చేసినట్టుకూడా అవుతుంది. అంతకంటే తనకేం కావాలి? కాని కోటాయి రాను రాను మరీ "రాలుగాయి" అయిపోతున్నాడు. ఎట్లాగో ఏమిటో వాణ్ణి దోవలో పెట్టడం?

పొయ్యిమీద ఎసట్లో బియ్యంవేసి, పొయ్యిముందు కూర్చుని కట్టెలు ఎగదోస్తూ, కోటాయి గురించీ, పార్వతి భవిష్యత్తు గురించీ ఆలోచిస్తూంది చుక్కమ్మ.

కోటాయికి చిన్నప్పుడే తల్లిదండ్రులు పోయారు.

వాడి నాయనమ్మే వాణ్ణి పెంచి పెద్దవాణ్ణి చేసింది. ఇంటిపక్క ఇల్లు కావడంతో ముసలమ్మకు దూరపు బంధుత్వంతోపాటు చుక్కమ్మతో మంచి దోస్తీ ఏర్పడింది. ముస లమ్మ పెంపు పేరుకేగాని, దాదాపు కోటాయి చుక్కమ్మ ఇంట్లోనే పెరిగాడు.

పార్వతీ, కోటాయీ ఒక ఇంట్లో పిల్లల్లాగే కలిసి మెలిసి పెరిగారు. తల్లీ తండ్రీ

లేనివాడని ముసలమ్మ కోటాయిని చాలా గారాబంగా పెంచింది. ముసలమ్మ తాలూకు డబ్బు ఖర్చయినకొద్దీ వాడిలో అల్లరిబుద్ధులు పెరిగినై. ముసలమ్మ కళ్ళుగప్పి, ఆ మూలా ఈ మూలా ముసల్ది జాగ్రత్త చేసిన డబ్బులు కాజేసుకెళ్ళి జల్సా చేస్తూండేవాడు. వాడి చుట్టూ కుర్రవాళ్ళ మూక ఉండేది. వాడి ముఠాలో అప్పుడప్పుడూ బస్సుస్టాండుల్లోనూ, సినిమాహాల్స్ దగ్గిరా జేబులు కొట్టేవాళ్ళుకూడా వుండేవాళ్ళు.

కోటాయి పదిహేనేళ్ళకే ఓ పిల్ల రౌడీలా తయారైనాడు. కోటాయికి పదిహేడో ఏడు వచ్చేసరికే వాడి నాయనమ్మ కాలప్రవాహంలో గుటుక్కుమంది.

అప్పటికే ముసలమ్మ బాగా వయసులో వుండగా రెక్కల కష్టంమీద సంపాదించిన డబ్బంతా కోటాయి బీడీ పీకలకు సరిపోయింది.

కోటిగాడి నాయనమ్మ చావబోయేముందు చుక్కమ్మ చేత, చేతిలో చెయ్యి వేయించుకొంది.

కోటాయికి పార్వతినిచ్చి పెళ్ళి చేస్తానని మాట చుక్కమ్మ దగ్గిర తీసుకొనిగాని ప్రాణం వదల్లేదు ముసలమ్మ.

నాయనమ్మ చావు కోటాయిలో కొంత మార్పు తీసుకురాకపోలేదు. అప్పట్నుంచీ వ్యక్తిత్వం, సర్వస్వాతంత్ర్యాలూ వచ్చినవాడిలా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. దానివల్ల వాడికి కలిగిన మంచికంటే చెడే ఎక్కువేమో!

అప్పట్నుంచి కోటాయి చుక్కమ్మ ఇంట్లోనే ఉండి, తిని తిరుగుతుండేవాడు.

రెండు సంవత్సరాలు గడిచిపోయినై.

చుక్కమ్మ కోటాయిని ఒకదారికి తీసుకొచ్చిందనే చెప్పాలి.

చుక్కమ్మ ప్రయత్నంమీద కోటాయికి ఒక సోడా కొట్లో ఒక పని కుదిరింది. రెండు నెలలు పనిచేసి అక్కడ మానేసి, సినిమా హాల్లో పాటల పుస్తకాలమ్మడానికి కుదిరాడు. కాని కొద్దిరోజులకే పుస్తకాలు అమ్మిన డబ్బులు హాలువాళ్ళకు సరిగా ఇవ్వకపోవడంచేత అక్కడినుంచి ఆ పనికి స్వస్తి జరిగింది. తర్వాత సైకిలుషాపులో పని కుదిరి, బుద్ధి కుదిరి బాగానే పనిచేశాడు. ఒకరోజు యజమాని లేని సమయం చూసి పది రూపాయలదాకా జేబులో వేసుకొని, ఎక్కడికో అంతులేకుండా పారిపోయాడు. ఆ పోయిన పోవడం పదిహేను రోజులదాకా పత్తా దొరకలేదు.

వాడు చేసిన పనికి చుక్కమ్మకు కోపం వచ్చినా వాడు కళ్లముందు కనబడకుండా పోయేసరికి, ఏమైపోయాడో ఏమో పాపం అని చుక్కమ్మ మనసు తహతహలాడిపోయింది.

"మావయ్య ఎప్పుడొస్తాడే?" అని తల్లిని మాటిమాటికీ అడుగుతూ పార్వతి బెంగపెట్టుకుంది.

కోటాయి తిరిగొచ్చాక, చుక్కమ్మ నయానా, భయానా హితబోధ చేసింది. ఇకనుంచి ఇలాంటి చెడ్డపనులు చేస్తే ఇంటికి రానివ్వననీ, పార్వతిని ఇవ్వననీ బెదిరించింది.

కోటాయి ఒట్టేసుకొని "ఇకనుంచి ఇంటిపట్టున ఉంటాను" అన్నాడు.

కోటాయి సత్ప్రవర్తనమీద చుక్కమ్మకు నమ్మకం కుదిరినా, ఊళ్లోవాళ్ళకు కుదరలేదు. వాణ్ణి నమ్మి ఎవరూ పనిలో పెట్టుకోలేదు.

ఉన్నకొద్దీ ఏదో ఒక పని సంపాదించి బతకాలనే దీక్ష కోటాయిలో బలపడి పోయింది. కుటుంబం గడవక చుక్కమ్మ పడుతున్న అవస్థలు కోటాయి మనసులో

పట్టుదలను కలిగించాయి.

ఒకరోజు గుంటూరునుంచి లారీ వచ్చి, కోటాయి మామూలుగానే కూర్చునే హోటలుముందు ఆగింది. కోటాయికి పరిచయమున్నవాడొకడు ఆ లారీ డ్రైవరుగా పని చేస్తున్నాడు. అతన్ని కోటాయి గుంటూరులో ఏదైనా పని ఇప్పించమని అడిగాడు.

అందుకు డ్రైవర్ "నువు చేసే పనులు గుంటూర్లో ఏం వుంటాయిగానీ, మా లారీలో క్లీనర్ పని ఖాళీగా వుంది. నువ్వు చేస్తానంటే మా ఓనర్‌కు చెప్పి ఇప్పిస్తాను" అన్నాడు.

"ఐతే జీతమెంత?" కోటాయి అడిగాడు.

"ఏభై. ఇంకా ట్రిప్పుల్నుబట్టి బేటా ఇస్తారు" అన్నాడు డ్రయివరు.

"సరే, ఇప్పుడే వస్తాను. మీ ఓనరుగారితో చెప్పి కుదుర్చు!" అని కోటాయి లారీ ఎక్కి కూర్చున్నాడు.

మూడోరోజు తిరిగొచ్చి కోటాయి చుక్కమ్మతో తనకు దొరికిన క్లీనర్ ఉద్యోగాన్ని గురించి చెప్పాడు.

"ఏదైతేనేం, బుద్ధికుదిరి చేసుకుంటే?" అని తన సంతోషాన్ని వెలిబుచ్చింది చుక్కమ్మ.

"ఇదిగో చుక్కమక్కాయ్! ఇట్లా క్లీనర్‌గా ఆరు నెల్లుండి, మెల్లిగా డ్రైవింగ్ నేర్చుకుంటే డ్రయివర్‌కూడా అయిపోవచ్చు! డ్రైవరైతే ఇబ్బడి కిబ్బడి జీతం! బత్తాకూడా దొరుకుద్దే చుక్కమ్మక్కాయ్!"

కోటాయి కళ్ళల్లో ఆశలు తళుక్కుమన్నాయ్.

"ఎందుక్కాకూడదురా మనసుండి చేసుకుంటేను? మా వూళ్ళో రామయ్య గారబ్బాయి, అదేదో దేశంపోయి, ఆ మరా ఈ మరా తిప్పడం నేర్చుకొని ఇప్పుడు రైలింజను డ్రైవరైపోలేదట్రా?" అన్నది చుక్కమ్మ.

అందాకా గడ్డం క్రింద చెయ్యి పెట్టుకొని వింటూ కూర్చున్న పార్వతి–

"అమ్మోయ్! మావయ్య రైలింజను డ్రయివరైతే నేను గార్డునవుతాలేవే!" అంటూ కిలకిలా నవ్వింది.

"ఒసేయ్ బోడీ! తంతానేవ్!" అంటూ కోటాయి పార్వతి చెవి పట్టుకోబోయాడు.

"అమ్మా! చూడవే ఈ కోతి ముఖమాడూ?" అంటూ పార్వతి తల్లిచాటున చేరింది.

"ఉండరా కోటాయ్! నువ్వు డ్రయివరు పని నేర్చుకొన్నాక పెళ్ళి చేసుకొని దాని పొగరు అణుద్దువుగాని!" అని మురిపెంగా అన్నది చుక్కమ్మ, కూతురు తల నిమురుతూ.

"పోవే! ఆ పేడతట్టముఖమాడ్ని నేనసలు చేసుకోను! ఊఁ!" రాగాలు తీస్తూ ఇంట్లోకి పరుగుతీసింది పార్వతి.

కోటాయి అన్నంతిని లారీ ఎక్కి వెళ్ళిపోయాడు.

కోటాయి వెళ్ళి మూడురోజులైంది.

ఇంతవరకూ రాలేదు.

ఏమైపోయాడో ఏమో?

–పొయ్యిముందు కూర్చొని ఆలోచిస్తూంది చుక్కమ్మ. పొయ్యిమీద అన్నం తుకతుకలాడుతూంది. చుక్కమ్మ హృదయం కోటాయికోసం తహతహలాడుతోంది.

కుర్రసన్నాసి! ఎంత కష్టపడుతున్నాడో ఏమో? అసలు లారీపని మానేసి ఎటైనా

పోలేదుగదా? ఏమో? ఆకతాయి! ఎంతకైనా తెగిస్తాడు. సుబ్బరంగా ఊళ్ళోనే ఏదైనా పని కుదిర్తే నయం, కళ్లముందు పడివుంటాడు. తన తెలివిమండ! వాణ్ణి అసలు లారీమీద పని చేస్తానంటే ఎందుకు వొప్పుకుంది? వాణ్ణి ఇష్టం వచ్చినట్టు అలా ఊళ్ళమీద తిరగనిస్తే ఇంకెందుకైనా పనికివస్తాడా?

అంతలోకే "సుక్కమ్మక్కాయ్! సుక్కమ్మక్కాయ్" అంటూ తడిక తోసుకొని లోపలకు వచ్చాడు కోటాయి.

గంజివార్చి అన్నపు తపేళా కింద పెడుతూన్న చుక్కమ్మ "వచ్చావురా నాయనా? రా!" అని ఆప్యాయంగా అన్నది.

అన్నపు తపేళానుంచి సెగ మూత సందులనుంచి బయటికి చిమ్మింది. తెడ్డుతో అన్నం కదిపి నిప్పులమీద పెడుతూ కోటాయిని చూసి "నీళ్ళు పోసుకోరా! ఉడుకుడుకు అన్నం తిందువుగానీ!" అన్నది.

"పార్వతేదీ!" ఇల్లు కలియజూస్తూ, చేతిలో వున్న పూసమిఠాయి పొట్లం కిందపెడ్తూ అన్నాడు కోటాయి.

"ఫాక్టరీ దగ్గిరకు వెళ్ళింది- ఊక తీసుకురావటానికి! చాలాసేపయింది. ఈ పాటికి వస్తుండాలి. ముందు నువ్వు కానియ్! బువ్వ ఉడికింది, పచ్చడి నూరుకొస్తాను" అంటూ చుక్కమ్మ పచ్చిమిరపకాయలూ, ఇంత కందిపప్పూ, చింతపండూ ఒక గిన్నెలో వేసుకొని రోటి దగ్గరకు వెళ్ళింది.

కోటాయి తలకు కట్టుకున్న రుమాలు తీసి దండెంమీదవేసి, వంటినున్న ఖాకీచొక్కా విడిచి, బ్లూ నిక్కరుతో నించున్నాడు, స్నానం చెయ్యడానికి భుజాన తుండుగుడ్డ వేసుకొని.

వాడి నల్లటి శరీరంమీద మురికి, దారులు దారులుగా కన్పిస్తోంది. శరీరంమీద అంతగా కండలు పెరక్కపోయినా, పుష్టిగల మనిషి అవుతాడనే చెప్పాలి. కోటాయికి పదిహేడు వెళ్ళి పద్ధెనిమిదో ఏడు వచ్చింది. యవ్వనంలో కాలు పెడ్తున్నాడు. మిసమిసలాడే శరీరం. విహంగాల్లా ఎగిరే భావాల తీవ్రత కోటాయి నిశితమైన చూపుల్లో తొణికిసలాడుతోంది. విశాలమైన నుదురూ, ఎత్తైన ముక్కూ , వుంగరాలు తిరిగి పొదలా నల్లటి జుట్టూ, మనిషి నలుపైనా ఆకర్షణీయంగా వుంటాడు.

కోటాయి స్నానంచేసి వచ్చేసరికి చుక్కమ్మ పచ్చడి నూరుకొచ్చింది.

"పార్వతి ఇంకా రాలేదేమే అక్కాయ్!" వళ్ళు తుడుచుకుంటూ అడిగాడు కోటాయి.

"ఏమోరా! చాలాసేపయింది. అది ఎక్కడికిపోతే అక్కడేరా! అన్నట్టు, మళ్ళీ ఆ మిషినీ సాయిబు దగ్గిరకెళ్లి కూర్చుందేమోరా!"

చుక్కమ్మ తడికె తోసి బయటికి చూసింది.

"అదుగోరా కోటాయ్! పార్వతి వస్తోంది."

పార్వతి ఊక బుట్ట నెత్తిన పెట్టుకొని వయ్యారంగా నడుస్తూ వస్తోంది.

గుబురు జుట్టులోకి దువ్వెన పోనిచ్చి దువ్వుకుంటున్న కోటాయి ఆగి, బయటకి చూశాడు.

అల్లంత దూరంనుంచే మామయ్యను చూసిన పార్వతికి సంతోషమూ, సిగ్గూ పొంగివచ్చాయి. ఆమె చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. విశాలమైన కళ్ళు మెరిశాయి. భుజాన వున్న బుట్టలోని పొట్టు ఝల్లున కిందకు రాలి తెల్ల పరికిణీమీద పడి నక్షత్రాల్లా మెరిసింది.

పార్వతి ముంగురుల్లో బంగారువన్నె వరిపొట్టు ఇరుక్కొని ఎండలో ముత్యాల్లా మెరుస్తోంది.

పార్వతికి పదమూడో ఏడు వచ్చింది. వికసించబోయే మొగ్గలా పార్వతి శరీరం కాంతులు ప్రసరిస్తోంది. ఏపుగా పెరిగివస్తోన్న పార్వతి సౌందర్యం రోజు రోజుకూ కోటాయిని ఆకర్షిస్తోంది.

నల్లంచు తెల్లని పరికిణీమీద, అక్కడక్కడా అతుకులు వేసి కుట్టిన చిలకవన్నె పావడా, తెల్లపూల గులాబీరంగు రవికా తొడుక్కొని, చిలిపి చూపులు చూస్తూ, లేడిలా గెంతుకుంటూ, వరిపొట్టు బుట్ట కిందదించి లోపలకు వచ్చింది పార్వతి.

"ఓహో మామయ్యగారు ఎప్పుడో దిగారే?" అని పరామర్శించింది పార్వతి.

పరికిణీబట్ట తెచ్చాడేమోననే ఆశతో ఇల్లంతా వెదికి పార్వతి తల్లివంకచూసి "తెస్తాడంటివే? ఎక్కడమ్మా?" ఏడుపుముఖం వేసి అన్నది.

"తెస్తాడులేవే ఈసారి గుంటూరు వెళ్ళినప్పుడు!" అని సముదాయించింది చుక్కమ్మ.

"ఎందుకూ బోడి అలుగుతోంది?" అన్నాడు కోటాయి.

"ఉసే పార్వతీ! అన్నట్టు - మావయ్య మిఠాయి తెచ్చాడే! మిఠాయి! పూస మిఠాయంటే నీకు ఇష్టం అని తెచ్చాడే!" అన్నది చుక్కమ్మ.

"నాకు మిఠాయీ వద్దు గిఠాయీ వద్దు! అదంతా ఆడి నెత్తినే కొట్టుకోమను." పార్వతి మూతి సున్నా చుట్టింది.

"ఒసేయ్ పిల్లా! ఏమిటే నీ ఏడుపు? వాడింటికొచ్చాడో లేదో మొదలుపెట్టావ్! అసలు నీకు వాడిపొడే గిట్టకుండా వచ్చిందేమే?" అన్నది చుక్కమ్మ చిరుకోపంతో.

"ఏమిటక్కాయ్' ఇంతకూ దానికి కావాల్సింది?" అడిగాడు కోటాయ్.

"పరికిణీగుడ్డ కావాలట! ఆదెమ్మ కూతురు కొనుక్కుందట! అట్టాంటిదే కావాలంట! నిమ్మళంగా కుట్టిత్తాలేవే అంటే మాటే ఇనిపించుకోకుండా ఆ వజాన మొండి కెత్తుక్కూచుంది" అన్నది చుక్కమ్మ విసుక్కుంటూ.

"ఎంత అవుతుందేమిటే!" అడిగాడు కోటాయి.

"ఎంత కాకేమిరా? పన్నెండుంబావలా అవుతుందట! ఇప్పుడికిప్పుడు ఎక్కణ్ణుంచి తెచ్చికొంటామే అంటే వినిపించుకోదు!" అన్నది చుక్కమ్మ.

"అబ్బో! ఈ బోడి ముఖానికి పన్నెండుంబావలా పరికిణీ కూడానా?" పార్వతి ముఖంలోకి చూసి నవ్వుతూ అన్నాడు కోటాయి.

"ఏయ్! మంగలం ముఖమాడోయ్! నవ్వబాకయ్యోయ్! అందం కారిపోతుంది. నిన్నెవడూ తెచ్చిపెట్టమన్లేదులే" అన్నది రోషంగా పార్వతి.

"అబ్బోస్! ఈ బోడి పన్నెండుంబావలా పరికిణీ కట్టుకొని సినిమాస్టారు అయిపోద్ది కావాలే చుక్కమ్మక్కాయ్!" అన్నాడు కోటాయి వెకిలిగా నవ్వుతూ.

ఆ మాటలకు పార్వతి ఉడుక్కుపోయింది. రోషం ఏడుపులోకి దిగింది.

'ఊс- పోండి! నాకు పరికిణీ వద్దు, ఏమీ వద్దు! పండగనాడు నేను పాత పరికిణీ కట్టుకుంటాన్లే! అసలు నాకేమీ వద్దు. వద్దనేవద్దు- పోండి!" అంటూ పార్వతి వెక్కివెక్కి ఏడ్వటం మొదలుపెట్టింది.

"ఊరుకోవే పిచ్చిపిల్లా! మామయ్య ఎగతాళికన్నాడు లేవే!" అంది చుక్కమ్మ.

"ఊరుకో బోడీ! గమ్మత్తుకంటే ఏడుస్తావేం? తప్పకుండా కొని తెస్తాను, ఊరుకో!"

అంటూ కోటాయి వెళ్ళి పార్వతి చేతులు పట్టుకొని బ్రతిమాలాడు.

పార్వతి రబ్బరుబొమ్మలా మామయ్య చేతుల్లోనుంచి జారి ముడుచుకు కూర్చుంది.

"ఊరుకో పార్వతీ! నీకు పరికిణీ, జాకెట్‌కూడా తెస్తాగా, గుంటూర్లో బాగా కుట్టేవాళ్ళుంటారు. అక్కడే కుట్టించి తెస్తాను. సరేనా?" మావయ్య పార్వతి గడ్డం పుచ్చుకు బతిమాలుతూ అన్నాడు.

పార్వతికి కొంత కోపం తగ్గినా ఇంకా బెట్టుగా ఖుంగమూతి పెట్టుకొని కూచుంది.

"సరే వుండు, నీ పని పట్టా" అంటూ ఇంత పూసమిఠాయిగడ్డ తెచ్చి పార్వతి నోట్లో బలవంతంగా కుక్కాడు.

"చూడవే అమ్మా!" పార్వతి మధురంగా నవ్వింది.

'సరే లెగండి! పొద్దెక్కింది. అన్నాలు తిందురు గాని" అని లేచిపోయి చుక్కమ్మ రెండు కంచాల్లో అన్నం పెట్టింది.

పార్వతి మామయ్య సరసన కూర్చుని సంతోషంగా అన్నం తినడం పూర్తయేలోపల నాలుగుసార్లయినా పార్వతిని ఉడికించి, ఏడిపించి, మళ్ళీ నవ్వించి వుంటాడు కోటాయి.

కోటయ్య అన్నం తిని గుంటూరు వెళ్ళడానికి ప్రయాణమైనాడు.

తలకు రుమాలు కట్టుకొని, ఖాకీచొక్కా, బ్లూ నిక్కరూ వేసుకొని 'ఆవారా'లా ఈల వేసుకుంటూ పోజులో నడిచిపోతున్న కోటయ్య మావయ్యను చూస్తుంటే పార్వతి హృదయానికి చక్కలిగింతలు పెట్టినట్టయింది. ఏవేవో తెలియని తియ్యటి ఊహలు పార్వతి మనసులో విరియబూచిన మల్లెపందిరిగా అల్లుకున్నాయి.

పోతూన్న మావయ్యతో "మావయ్యోయ్! పరికిణీ మర్చిపోకుండా తీసుకరావాలి" వెనకనుంచి కేకపెట్టింది పార్వతి.

వెనక్కు తిరిగి, చిరునవ్వులు చిందిస్తూ కోటయ్య పార్వతి ముఖంలోకి చూశాడు.

"ఎర్రపూల నల్లంచు తెల్లపావడా మావయ్యా!" పార్వతి కంఠం కోకిలమ్మ గొంతులా పాడింది.

కోటయ్య పెదవులపై హాసరేఖలు అనంతంగా వెన్నెలలా ప్రవహించాయి.

"గులాబివన్నె జాకెట్! మావయ్యా!"

"చిలకపచ్చ ఓణీకూడా?" అన్నాడు కోటాయి.

"మావయ్యాఁ, ఎర్రపూల నల్లంచు తెల్లపరికిణీ! చిలకపచ్చఓణీ! గులాబివన్నె రవికా! అన్నీ తెస్తావా మావయ్యా?" ఆనందం పార్వతి కంఠంలో సెలఏరులా ప్రవహించింది.

"అన్నీ తెస్తానే? ఎర్రపూల నల్లంచు తెల్లపరికిణీ! చిలకపచ్చ ఓణీ! గులాబి రవికా! అన్నీ తెస్తానే బోడీ?" ఉత్సాహంగా అంటూ వీధి మలుపున రొదచేస్తూ నిల్చున్న లారీ ఎక్కి వెళ్ళిపోయాడు కోటాయి.

మావయ్య పోతూ "బోడీ" అన్న చివరి మాటకు చిరుకోపం వచ్చినా, హృదయంలో పొంగి పొరలి వస్తున్న ఆనందపు అలల్లో కొట్టుకుపోయింది పార్వతి.

"మావయ్యంటే మావయ్యా! బలే మావయ్యా!" అని చప్పట్లు చరుచుకుంటూ లోపలకు వెళ్ళింది పార్వతి.

✿ ✿ ✿

రేపు లేదు ఎల్లుండే పండుగ.

నాలుగు రోజులనాడు వెళ్ళిన మావయ్య ఇంకా రాలేదు.

చీకటికూడా పడింది. ఐనా మావయ్య రాలేదు.

ఇంకెప్పుడొస్తాడు మావయ్య?

బజార్లో లారీమోత! మావయ్య వస్తున్నాడేమో?

దూరంగా రోడ్డుమీద హెడ్‌లైట్ల కాంతి.

కోటయ్య మావయ్య వస్తుండాలి.

పొద్దుపోయింది. జనం అంతా సద్దుమణిగారు.

ఇంకా రాలేదేం మావయ్యా?

అసలు వస్తాడా? మావయ్య రానేరాడా?

అమ్మకూడా నిద్రపోయింది.

మావయ్య రాకపోతే ఎర్రపూల నల్లంచు తెల్లపరికిణీ తనకెవరు తెస్తారు?

చిలకపచ్చ ఓణీ?

గులాబివన్నె రవికా?

తనకు...?

పార్వతికి ఏడుపొస్తూంది. దిండులో ముఖం పెట్టుకొని వలవలా ఏడ్చింది.

తను ఏడిస్తే ఎవరన్నా తెచ్చిస్తారా?

తను ఏడిస్తే మావయ్య వస్తాడా?

ఛీ! తను ఏడవకూడదు. ఎందుకోమరి తను ఏడవకూడదనిపిస్తుంది.

పార్వతికి నరనరానా కసీ, రోషం పొరుకాడాయి.

"ఎర్రపూల నల్లంచు పరికిణీ"

మావయ్య అబద్ధాలకోరు!

"చిలకపచ్చ ఓణీ..."

వాడే బోడిగాడు. అన్నీ అబద్ధాలే!

"గులాబీవన్నె రవికా..."

అబద్ధాలు... అబద్ధాలు...

కోతిగాడు. మంగలం మొఖమాడు. అన్నీ అబద్ధాలు. వాడు తీసుకురాడని తనకు ముందే తెలుసు. వాడి మాటలు అసలు తను నమ్మనేలేదు. అమ్మే నమ్మింది. అదే నమ్మింది. ముందు దాన్ని తంతే వాడికి బుద్ధొస్తుంది.

పార్వతికి దుఃఖం పొంగిపొర్లింది. కుమిలి కుమిలి ఏడ్చింది.

రాత్రి నడిఝాము దాటింది.

దూరంగా ఇలకోడి కూత సన్నగా విన్పిస్తోంది.

పార్వతి కళ్ళు మూసుకుంది. కళ్ళు తెరిచింది-చూసింది. బయటంతా చీకటి.

పార్వతికి కళ్ళుమూసినా, తెరిచినా అంతా చీకటిగానే వుంది.

ఆ చీకట్లో, ఎర్రపూల నల్లంచు తెల్లపరికిణీ- కోటిగాడూ- ఇంకా- ఇంకా- వందలకొద్దీ-వేలకొద్దీ...పరికిణీలూ...ఓణీలూ-కోటయ్య మామలూ-మెలుకువలోంచి నిద్రలోకి- నిద్రలోంచి పీడ కలలోకి పార్వతి జారిపోయింది.

తెల్లంగా తెల్లవారింది.

సూర్యుడు కరకరా ఎక్కివస్తున్నాడు.

పార్వతి నిద్రమంచంమీదనుంచి లేచి కూర్చుంది.

ఐనా కోటయ్య మావ రాలేదు.

"ఇంకా ఏం కూచుంటావ్? లేచి ముఖం కడుక్కో" అన్నది తల్లి పార్వతి దగ్గిరకొచ్చి.

"అమ్మా! కోటయ్య మావ రాలేదేమే?"

"అన్నం వేళకు వస్తాడేమోలే!"

"వస్తాడా?" ఆశలు మనసును ఊరడిస్తూవుంటే పార్వతి మంచందిగిరిది కళ్లు నులుపుకుంటూ.

"అన్నం వేళ అయింది. అయినా మావయ్య చావలేదు. అదే రాలేదు. అదే చచ్చాడేమో? చస్తే చచ్చాడు. చస్తే మరీ బాగుంటుంది. వాడు చస్తే నేను ఏడవనే ఏడవను. అసలు నాకు ఏడుపే రాదు వాడు చస్తే!"

పార్వతికి ఏడుపు పొర్లుకొచ్చింది.

"అదేవిటే పిచ్చిపిల్లా! అన్నం ముందు కూచుని ఏడుస్తావేం?" అన్నది చుక్కమ్మ.

పార్వతికి అన్నం సహించలేదు.

"నాకు అన్నం వద్దు!" అని పళ్ళెంలో నీళ్లుపోసి లేచి వెళ్ళిపోయింది పార్వతి.

"ఏడవబాకే! ఎట్టాగట్టా సాయంకాలానికి పరికిణీగుడ్డ కొనిస్తాగా!" అన్నది చుక్కమ్మ.

"సాయంకాలానికి కొనిస్తే మిషినీ సాయిబు ఎప్పుడు కుట్టిస్తాడేం?" దీర్ఘంతీస్తూ అన్నది పార్వతి.

"రేపు మధ్యాహ్నానికి కుట్టిస్తాడులే! సాయంకాలం గుడి దగ్గరకు పోయేప్పుడేగా అందరూ కొత్తబట్టలు వేసుకొనేది?" అని చుక్కమ్మ కూతురుకు నచ్చచెప్పి, కొయ్యపెట్టి తెరిచి, ముంత బయటికి తీసి, చిల్లర అరచేతిలో పోసుకొని లెక్కచూసింది.

లెక్క చూసుకొని "పావలా తక్కువ ఆరు!" అనుకుంది.

ఐదుంపావలాకు పరికిణీగుడ్డ, మిగతా అర్ధరూపాయికి ఏదో ఒకటి చవకరకం రవికగుడ్డా వస్తవి. పోతే వోణీ ఏదో వొక పాతది వేసుకుంటే ఎల్లమారిపోదా అనుకొన్నది చుక్కమ్మ.

దిగాలుపడి ఇంట్లో కూచున్న పార్వతి దగ్గిరకు ఆదెమ్మ కూతురూ, ఇంకా నలుగురు స్నేహితురాండ్రు-పార్వతి ఈడువాళ్లే గుంపుగా వచ్చి పడ్డారు.

"మీ మామయ్య పరికిణీ, వోణీ తెచ్చాడా? ఏదీ చూపించవోయ్?" అన్నది ఆదెమ్మ కూతురు.

"మా మామయ్య ఇంకా రాలేదు-" అన్నది పార్వతి చిన్నబుచ్చుకొని.

కోటయ్య చెప్పి వెళ్ళినదగ్గరనుంచీ, స్నేహితురాండ్ర దగ్గిర చిత్రవిచిత్రంగా కోతలు కోసింది పార్వతి. ఇప్పుడు వాళ్లొచ్చి పరికిణీ చూపించమనేసరికి ఆమె ప్రాణం విసిగిపోయింది.

స్నేహితులతో కలిపి ఇంటింటికీపోయి, వాళ్లు కుట్టించుకున్న పరికిణీలూ, చొక్కాలూ చూసి వచ్చింది. ముఖ్యంగా ఆదెమ్మ కూతురు బోడి కుట్టించుకున్న ఎర్రపూల నల్లంచు తెల్ల పరికిణీ తాకి చూసి తన వంటిమీద పెట్టుకొని కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోయింది పార్వతి.

ఇంటికి వస్తూ, దారిలో మిసినీ సాయిబు దగ్గిరకు వెళ్ళి మంచి మంచి గుడ్డ పేలికలు-రిబ్బన్‌లకు బదులు జడకు కట్టుకోవడానికి తెచ్చుకొన్నది.

సూర్యుడు పడమటి దిక్కున తిరిగి వాలిపోతున్నాడు.

సాయంత్రమౌతుంది.

"ఏమే అమ్మా! ఇంకెప్పుడే?" అన్నది తల్లిని చూసి పార్వతి.

చుక్కమ్మ ముంతలోని చిల్లర కొంగున ముడేసుకొని "సరే పద!" అని పార్వతిని వెంటబెట్టుకొని పెద్ద బజార్లో వున్న బట్టల దుకాణానికి బయలుదేరింది.

కోటాయి కోసం ఎదురుచూసి చూసి, ఆశలు అడియాశలుకాగా చుక్కమ్మ బయలుదేరింది.

కోటాయి వస్తూ పిల్లకు బట్టలు తెస్తే, డబ్బులు తెల్లారి పండుగ ఖర్చుకు వుంటాయి కదా అని ఇంతవరకు అనుకుంది చుక్కమ్మ. కూతురు పరికిణీ గుడ్డకోసం పడుతున్న ఆరాటం చుక్కమ్మ హృదయంలో వొకవైపు బల్లెంలా గుచ్చుకొంటున్నా, కోటాయి వస్తాడనే ఆశతో ఎదురుచూసింది. అన్నిమాటలూ చెప్పి కోటాయి రాకపోయేసరికి చుక్కమ్మ మనసులో వాడిమీద కోపం, అసహ్యంకూడా కలిగాయి.

కూతురుకు పండుగకైనా అనువైన బట్టలు కుట్టించలేకపోయాననే అన్న కడుపు కోత; తల్లీ, తండ్రీలేని కుర్రసన్యాసి పండుగపూట కూడా కళ్ళముందు లేకుండా, ఏమైపోయాడా అన్న హృదయావేదనా చుక్కమ్మను వేధిస్తున్నాయి.

నడుస్తూన్నంతసేపూ పార్వతికి మావయ్యమీద కోపం అంచలు అంచలుగా వచ్చి పడుతోంది. మావయ్యను గురించి మనసులో ఏమోమో అనుకుంటూ బట్టల దుకాణం దగ్గిరికి తల్లితోపాటు వచ్చింది.

చీరల దుకాణం ముందుకు రాగానే పార్వతి హృదయం ఎగిరి గంతేసింది. బీరువాలో పరికిణీ బట్టలు కనబడుతూవుంటే పార్వతి మనసు ఆనందంలో వురవళ్ళూ, పరవళ్ళూ తొక్కింది. చుక్కమ్మ బట్టల దుకాణంలో కాలు పెట్టబోతుండగా వెనకనుంచి "చుక్కమ్మా!" అని ఎవరో పిల్చారు.

చుక్కమ్మ వెనుదిరిగి చూసింది.

ఆదెమ్మ, మరో మగ మనిషీ రొప్పుకుంటూ, రోజుకుంటూ పరిగెత్తుకుంటూ వచ్చారు.

"ఇంకేముందే చుక్కమ్మా! కొంప ఆరిపోయింది. కోటాయి లారీమీదినుంచి పడ్డాడట. ప్రమాదంగా వుందట. ఇదిగో, ఈ మనిషి వచ్చాడు గుంటూరునుంచి" అని గాబరాగా చెప్పింది ఆదెమ్మ.

చుక్కమ్మ కొన్నిక్షణాలపాటు స్థంభించిపోయింది.

పార్వతి ముఖం వెలవెలబోయింది.

దాని లేతహృదయం ఏం బాధపడిందో?

గుంటూరునుంచి లారీ ఓనరు పంపించిన మనిషి జరిగిన సంగతి వివరంగా చెప్పాడు.

ఉదయం లారీ, బియ్యపు బస్తాలు వేసుకొని గుంటూరునుండి వస్తోంటే, ఒక చెట్టుకు గుద్దుకొని రోడ్డు పక్కన గుంటలో బోల్తా కొట్టింది. లారీ బాడీలో బస్తాలమీద

కూర్చుని వున్న కోటాయికీ, డ్రైవరుకూ, మరొకరికీ తీవ్రంగా గాయాలు తగిలాయనీ, ఆసుపత్రిలో చేర్పించారనీ, కోటాయి పరిస్థితి మరీ ప్రమాదంగా వుందనీ చెప్పాడు.

ఉన్నపాటున చుక్కమ్మ, ఆదెమ్మను తోడుతీసుకొని పార్వతితో గుంటూరు బస్సు ఎక్కింది.

త్రోవలో చుక్కమ్మ కోటాయిని తల్చుకొని ఏడ్చింది.

తల్లి ఏడుస్తుంటే పార్వతికీ ఏడుపొచ్చింది.

పార్వతి ఎందుకేడ్చిందో ఆ దేవుడికికూడా తెలియదేమో!

కొనుక్కోబోతున్న పరికిణీ కొనకుండా అయిపోయింది. మావయ్య లారీమీదనుంచి కిందపడ్డాడు. అయితే చచ్చిపోతాడా? పాడు మావయ్య తనకు ఎర్రపూల పరికిణీ లేకుండా చేశాడు. ఛీ! మావయ్య ఎప్పుడూ ఇంతే!

ఎర్రపూల పరికిణీ, కోటయ్య మావయ్య, అమ్మా, అందరూ కలిసి తనను ఏడిపిస్తున్నారు.

పార్వతి హృదయం క్షోభించిపోయింది. లోలోపలే ఎందుకో, మరెందుకో, అర్థాలు లేకుండానే ఏడ్చింది. తెలిసీ తెలియని వయస్సూ-అమాయకపు టాలోచనలూ- పార్వతి మనసులో అల్లిబిల్లిగా తిరిగాయి. మధ్య మధ్య మామయ్యమీద కసి... ...

తన్ను అన్యాయం చేస్తే, మరి ఏదో ఒకటి జరగదూ? మంచిపని జరిగింది! అయ్య తిక్క కుదిరింది!

పార్వతి చూస్తుండగానే చుక్కమ్మ కొంగు ముడివిప్పి, బస్సు వాడికి డబ్బులు ఇచ్చింది. తన ఎర్రపూల నల్లంచు పరికిణీ డబ్బు బస్‌వాడు జేబులో వేసుకొన్నాడు. వాడి జేబువైపు కసిగా చూసింది పార్వతి. ఆమెకి, ఎందుకో ఊరికినే ఏడ్పు వస్తోంది.

బస్సు గుంటూరు చేరింది. చుక్కమ్మా, ఆదెమ్మా, పార్వతీ ఆస్పత్రికి వెళ్ళి, కోటాయి వున్న వార్డులోకి వెళ్ళారు.

కోటయ్య బెడ్‌మీద స్పృహతప్పి పడివున్నాడు. గాయలూ మోపుగా తగిలాయి. ఖాకీ చొక్కా, నీలం రంగు లాగూ రక్తంలో తడిసివున్నాయి. తలకూ, మోచేతులకూ, కాళ్ళకూ కట్లు కట్టి వున్నాయి. రక్తహీనమై పాలిపోయిన కోటాయి ముఖంమీద తుడిచేసిన రక్తపు చారికలు ఇంకా కన్పిస్తున్నాయి.

చుక్కమ్మ కోటాయిమీదపడి ఘొల్లున ఏడ్చింది. డాక్టరూ, నర్సులూ చుట్టూ చేరారు. మావయ్యనుచూసి పార్వతి బావురుమంది. చుక్కమ్మ పార్వతిని ఊరుకోబెట్టటానికి ప్రయత్నించింది.

ఒక అరగంటలో కోటాయి మూలిగి, నీరసంగా కళ్ళు తెరిచాడు.

పార్వతి ఆదుర్దాగా మావయ్య కళ్ళలోకి చూసింది. కోటయ్య బెడ్ పక్కనున్న నర్సుకు సంజ్ఞ చేశాడు, కట్టు కట్టివున్న చెయ్యి మెల్లిగా కదిలిస్తూ. నర్సు కాగితం చుట్టి, బాగా నలిగిపోయి వున్న పార్సిల్ కోటాయికి ఇచ్చింది.

కోటాయి మెల్లిగా అందుకొని... ...

"ఇదిగో బోడీ!" అంటూ పార్వతి చేతుల్లో పెట్టాడు. రక్తసిక్తమైన కోటాయి పెదవులమీద చిరునగవు నీరసంగా తొణికింది.

పార్వతి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. ఆ కళ్ళల్లో ఆసుపత్రిలోని ఎలక్ట్రిక్ లైట్ల

కాంతులు ప్రతిఫలించి మెరిశాయి.

కోటాయి బాధగా మూలిగి కళ్లు మూసుకున్నాడు.

మావయ్యకు ఏదో చెప్పాలనుకుంది పార్వతి. కాని మావయ్య అప్పటికే కళ్లు మూసుకున్నాడు.

డాక్టరువచ్చి కోటాయి నాడిచూసి "రక్తం పూర్తిగా పోయింది. రాత్రికికూడా రక్తం ఎక్కించండి-" అని నర్సుతో అన్నాడు.

మంచం చుట్టూ వున్నవాళ్ళను బయటికి పంపించింది నర్స్.

డాక్టర్ చుక్కమ్మతో చెప్పాడు:

"కేసు ప్రమాదంగానే వుంది. రాత్రి గడిస్తే ఫర్వాలేదు. ఎవరైనా బెడ్ దగ్గిర వుండండి."

చుక్కమ్మ, పార్వతిని ఆదెమ్మతో ఇంటికి పంపించింది. తను కోటాయి మంచం అంటి పెట్టుకుని వుంది.

ఆదెమ్మా, పార్వతీ బస్సెక్కి ఇంటికి వచ్చారు. ఇల్లు చేరేసరికి రాత్రి పది గంటలు దాటింది. పార్వతి చేతిలో బట్టల పాకెట్ పట్టుకొని మౌనంగా వుంది. ఆదెమ్మ పార్వతిని తన ఇంటికి తీసుకెళ్ళింది.

రాత్రి పార్వతి అన్నం సరిగా తినలేదు. సరిగా నిద్రపోలేదు.

తెల్లవారింది, పండగ వచ్చింది.

దిగులుగా ఓమూల కూర్చున్న పార్వతిని ఊరడించి ఆదెమ్మ తలంటి పోసింది.

మధ్యాహ్నం బూరెలు తింటూంటే పార్వతికి మావయ్య గుర్తొచ్చాడు.

తనకు ఆదెమ్మ ఇచ్చిన నాలుగు సజ్జ బూరెల్లో రెండు కాగితంలో పొట్లం కట్టి దాచింది.

మావయ్య నయమై తొందరగా వస్తాడు! మావయ్య నోట్లో బలవంతంగా, ఎవరూ చూడకుండా సజ్జ బూరె కుక్కుతుంది. మరి మావయ్య ఆ రోజు పూస మిఠాయి తన నోట్లో... ... అబ్బా! అల్లరి మామయ్య! భలే మావయ్యలే!

సాయంకాలమైంది. పెద్దవాళ్ళంతా శివాలయం దగ్గరకు పంచాంగం వినడాని కెళ్తున్నారు.

పిల్లలు సింగారించుకొని కోలాహలంగా శివాలయం ముందు ఆడుకుంటున్నారు.

ఆదెమ్మ పెట్టెలో దాచిన బట్టలుతీసి పార్వతికిచ్చింది.

పొట్లం విప్పి చూసుకుంది పార్వతి.

ఎర్రపూల నల్లంచు తెల్ల పరికిణీ, చిలకపచ్చ ఓణీ, గులాబివన్నె పట్టు జాకెట్!

పార్వతి మనస్సు ఏదో లోకంలో విచ్చలవిడిగా విహరించింది.

"మీ మావయ్య భలే గుడ్డలు తెచ్చాడే!"

ఆశ్చర్యంగా అన్నది ఆదెమ్మ కూతురు.

"మరి మా మావయ్యంటే ఏమిటనుకున్నావ్?" అన్నది పార్వతి పరికిణీ కట్టుకుంటూ.

తెల్ల పరికిణీ కుచ్చిళ్ళ దగ్గిర ఎర్రపూలతో కలిసిపోతూ అరచేతి వెడల్పున ఎర్రటి రక్తపుడాగు వుంది!

పరికిణీమీద ఆ రక్తపు డాగు కన్పించకుండా చిలకపచ్చ ఓణీ వేసుకుంది పార్వతి.

ఎఱ్ఱపూల నల్లంచు తెల్లపరికిణీ కట్టుకొని, చిలకపచ్చ సిల్కు ఓణీ వేసుకొంది, గులాబివన్నె పట్టు జాకెట్ తొడుక్కొని పార్వతి నొసట దమ్మిడీ అంత తిలకం బొట్టు పెట్టుకొని సింగారించుకొని స్నేహితురాండ్రతో కలిసి శివాలయానికి వెళ్ళింది.

శివాలయం మండపంమీద కూర్చుని పురోహితుడు పంచాంగం చదువుతున్నాడు.

ఆడవాళ్ళూ, రైతులూ, ఊళ్లో జనం అంతా కొత్త సంవత్సరం తమకు మోసుకువచ్చిన సిరిసంపదల గురించి వింటూ కూర్చున్నారు.

ఆడపిల్లలూ, మొగపిల్లలూ, ఏ ఈడుకా ఈడువాళ్లు గుంపులు గుంపులుగా చేరి ఆడుకుంటున్నారు.

పార్వతి కొత్త బట్టలు కట్టుకొన్న ముఖంలో ఆనందపు తెరలను తోసుకుని విషాదచ్ఛాయలు కనిపిస్తున్నాయి. మనసులో ఏదో గుబులుగా వుంది. ఆ పిల్లల్లో కూర్చుంటే తనకు వంటిమీద జెర్రులు పాకులాడినట్లుగా వుంది.

పార్వతి లేచి రయ్యిన ఇంటికి పరిగెత్తింది. త్రోవలో ఆదెమ్మ ఎదురైంది.

"ఒసే పార్వతీ! మీ మావయ్యకు బలువుగా వుంది, రమ్మని మీ అమ్మ కబురుచేసింది. నువ్వూ, మా అమ్మాయీ ఇల్లు భద్రంగా చూసుకుంటూ వుండండి! రేప్పొద్దున తిరిగొస్తాను," అని చెప్పి ఆదెమ్మ బస్స్టాండుకు వెళ్ళిపోయింది.

పార్వతికి ఇంటికి వెళ్ళడానికి మనస్కరించలేదు. తిరిగి శివాలయం దగ్గిరకు వెళ్ళింది. వెళ్ళిందేగాని పిల్లల్తో చేరి ఆడుకోవాలనిపించలేదు.

నిర్మానుష్యంగా ఉన్న శివాలయం వెనక్కి వెళ్ళి గుడిగోడ కానుకొని వంటరిగా కూర్చుంది పార్వతి.

సూర్యుడు పశ్చిమాన కొండలచాటుకు పోతున్నాడు.

శివాలయం ఆవరణలో వున్న మారేడుచెట్లు చీకటినీడల్ని విరజిమ్ముతున్నాయి.

మూసుకుంటున్న చీకట్లో, నిర్జన ప్రదేశంలో వంటరిగా కూర్చొని బావురుమని ఏడ్చింది.

మావయ్య–కోటయ్య మావయ్య చచ్చిపోయాడా? లేదు. మావయ్యకు నయమౌతుంది. బతికి ఇంటికి వస్తాడు. మామయ్య నోట్లో తను సబ్జబూరెలు కుక్కుతుంది.

మావయ్యను తను తిట్టింది. తను తప్పుపని చేసింది. -

మావయ్య చచ్చిపోతే ఎక్కడికి పోతాడు? మావయ్యతోబాటు తనూ చచ్చిపోతుంది! చచ్చిపోయి మావయ్య దగ్గిరకు వెళ్ళిపోతుంది.

ఎంతమంచి పరికిణీ, ఓణీ, రవికా తెచ్చాడు మావయ్య! ఎంత మంచి మావయ్య? మావయ్య చచ్చిపోడు! తిరిగి ఇంటికి వస్తాడు... ...

వెక్కి వెక్కి ఏడుస్తూంది పార్వతి.

గుడిగోడకు ఆనుకొని చేతులు జోడించి దేవుణ్ణి ప్రార్థించింది పార్వతి... ...

"స్వామీ! మా మావయ్యకు నయం చెయ్యి. నీకు వంద కొబ్బరికాయలు కొడ్తాను."

"మావయ్యా! మావయ్యా!"

పార్వతి, ముఖం ఎఱ్ఱపూలు నల్లంచు తెల్ల పరికిణీలో దూర్చి కుమిలి కుమిలి ఏడ్చింది.

పరికిణీపై అతుక్కుపోయిన మావయ్య రక్తం పార్వతి నొసటి తిలకంతో హత్తుకుపోయింది.

పార్వతి రోదనం-తన మావయ్యని బ్రతికించమని చేసిన ప్రార్థనా, మొరా, గుళ్ళో పదిలంగా కూర్చున్న పార్వతీ-పరమేశ్వరులు విన్నారో లేదో... కానీ-

గుడిముందు కొత్త సంవత్సరం పంచాంగం పఠనం చేస్తూ, నూతన సంవత్సరం తెచ్చిన సిరిసంపదలను ఎలుగెత్తి ఘోషిస్తున్న పురోహితుని కంఠధ్వనిలో మునిగిపోయి, శివాలయం ముందు కూర్చున్న జనంలో ఎవరికీ వినబడినట్టు లేదు.

(సౌభాగ్య 1954)